

పిల్లలకు పౌష్టికాహారం తినిపిస్తున్న టీచర్, ఆయా



మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులను నిద్రపుచ్చుతున్న అంగన్‌వాడీ సిబ్బంది



చిన్నారులకు ఆటపాటలతో అంకెలు నేర్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అమ్మ ఒడిలాంటి అంగన్‌వాడీ



చిన్నారి బరువు చూస్తున్న అంగన్‌వాడీ టీచర్

• ప్రీస్కూల్‌లో ఆటపాటలతో విద్యాబోధన • ఉత్సాహంగా నేర్చుకుంటున్న చిన్నారులు • పౌష్టికాహారంతో ఆరోగ్య రక్షణ

అల్లిపురం: మహిళలు, వారి పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంగన్‌వాడీ కేంద్రాలు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయి. నేడు అవి గర్భిణులు, బాలింతలతోపాటు కౌమార దశలోని ఆడపిల్లలు, మూడేళ్లు దాటిన పిల్లల సంరక్షణకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. అంగన్‌వాడీ సెంటర్లు చిన్నారులకు అమ్మ ఒడిని తలపిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో ఆటపాటలతోకూడి విద్యను బోధించడంతో వారిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ స్కూళ్లుగా మారి వాటికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. గత ప్రభుత్వం అందించిన పోషకాహారం మెనూనే నేటికీ కొనసాగిస్తున్నారు. పిల్లలకు ఉచిత విద్యతోపాటు ఆటపాటలతో అంకెలు, ఏబీసీడీలు నేర్పిస్తూ ఉల్లాసంగా ఉంచడంలో అంగన్‌వాడీ టీచర్, ఆయాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో చిన్నారులను సులువుగా ఆకట్టుకుంటున్నారు. దీంతో **చిన్నారులు ఇంట్లో కంటే అంగన్‌వాడీ కేంద్రంలోనే ఎక్కువ సమయం గడిపేందుకు** ఇష్టపడుతున్నారంటే అతిశయోక్తి కాదు.

చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం..

జీవీఎంసీ 32వ వార్డులో 4, 33వ వార్డులో 5, 34 వార్డులో 6 చొప్పున అంగన్‌వాడీ ప్రీస్కూళ్లు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో సుమారు 20 మంది చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే చిన్నారుల సంఖ్య పెంచేందుకు పౌష్టికాహారం విషయంలో జాగ్రత్తలు వహిస్తున్నారు. గుడ్డు, ఆకుకూరలు, పప్పు, కూరగాయలతో కూడిన మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. పిల్లలకు ఇంట్లో అమ్మ ఎలాగైతే కొసరి కొసరి తినిపిస్తారో అలానే అంగన్‌వాడీ సిబ్బంది లాలించి తినిపించడం విశేషం. తిన్న తరువాత చిన్నారులను కొంత సేపు విశ్రాంతి తీసుకునేలా జోలపాటలతో నిద్ర పుచ్చడంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇంటిలానే పిల్లలు భావించడం విశేషం.



చిన్నారులకు సంపూర్ణ రక్షణ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు సంపూర్ణ సంరక్షణను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రతి నెలా చిన్నారుల బరువు, ఎత్తు నమోదు చేస్తాం. వారిలో ఎదుగుదలను గుర్తిస్తాం. వారికి పోషకాహారం అందజేస్తున్నాం. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆటపాటలతో పిల్లలను ఉల్లాసంగా ఉంచుతున్నాం.

– తను, అంగన్‌వాడీ టీచర్, అమ్మవారి వీధి, 33వ వార్డు



పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటాం

పిల్లలు ఉదయం అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చిన దగ్గర నుంచి వారిని జాగ్రత్తగా చూసుకుంటాం. సమయానికి ఆకుకూరలు, పప్పుతో చక్కటి పోషకాహారం వండి పెడుతుంటాను. చిన్నారులకు తగిన విధంగా విశ్రాంతి ఇస్తుంటాం. ఆటలు ఆడిస్తుంటాం. పిల్లలు ఆనందంగా, ఉత్సాహంగా ఉంటారు.

– కొండమ్మ, ఆయా, అమ్మవారివీధి అంగన్‌వాడీ



పిల్లలందరినీ చక్కగా చూసుకుంటున్నారు

మా పాపకు మూడేళ్లు. అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చినప్పటి నుంచి ఉల్లాసంగా, చురుగ్గా ఉంటుంది. చక్కగా రైమ్స్ చదువుతోంది. అంగన్‌వాడీ టీచర్, ఆయా బాగా చూసుకుంటున్నారు. మంచి పోషకాహారం అందిస్తున్నారు.

– కె.రామలక్ష్మి, కుమ్మర వీధి

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త అవసరం

● జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్ : నగరంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, వాటి నుంచి జాగ్రత్తగా ఉండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి సూచించారు. సైబర్ నేరాలపై సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఐఎల్ నరసింహారావుతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మహిళా వెల్ఫేర్ కార్యదర్శులు, ఎన్జీవోస్, అకౌంట్ విభాగం, ఎస్ఆర్‌యూ విభాగం, సీవోసీ విభాగాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, అందుకు సంబంధించి తమ మొబైల్ హ్యాకింగ్‌కు గురికాకుండా సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల వేధింపులు, సైబర్ నేరగాళ్లపై ఏ విధంగా ఫిర్యాదు చేయాలో తెలుసుకోవాలన్నారు. అనంతరం ఐఎల్ నరసింహారావు మాట్లాడుతూ సైబర్ నేరాలు, మొబైల్ సెక్యూరిటీ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. సైబర్ నేరాల రకాలు, మొబైల్ హ్యాకింగ్ జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఏ విధమైన సంఘటనలు జరిగినప్పుడు ఎక్కడ? ఎలా? ఫిర్యాదు చేయాలో వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు శివప్రసాద రాజు, పర్యవేక్షక ఇంజినీరు గోవిందరావు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ నేతృత్వంలో శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర సంచాలకుడు పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కడారి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.శ్రీనివాసరెడ్డి, జాతీయ సేవా సమితి (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.భాస్కరరావు పాల్గొని శిబిరం ప్రారంభించారు. సుమారు 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి



మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కంచరపాలెం: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తదితరులు శనివారం నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, నాయకులు పాత్రపల్లి సునీల్‌కుమార్, వేళంగిణిరావు, చుక్కా శ్యామ్ సుందర్‌రెడ్డి, కుమార్, ఆర్.శ్రీనివాస్‌రావు, అన్నపూర్ణ, దేవి, జ్యోతి, కార్యకర్తలు పాల్గొన్నారు.


కర్రి రాముకు నివాళి



కర్రి రాము చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం తండ్రి కర్రి రాము ఇటీవల కాలం చేయడంతో శనివారం ఆయన దశ దిన కర్మ డాబాగార్డెన్స్‌లో నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, కళా హాస్పిటల్ అధినేత పి.రమణమూర్తి, 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, కొడమంచిలి శ్రీను, రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు బొడ్డు పోలరావు, గణేష్, నాగరాజు, సత్యవతి, 34వ వార్డు నాయకుడు దూడ అప్పారావు, తాతబ్బాయి, వెంకటేశ్వరమెట్ట వెంకట గౌరీ శంకర గ్రంథాలయం సభ్యులు కోరిబిల్లి ప్రసాద్, భీశెట్టి శ్రీను, పాలమరశెట్టి శ్రీను తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

రెవెన్యూ సదస్సుకు 21 దరఖాస్తులు



ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీకి దరఖాస్తు అందజేస్తున్న స్థానికులు

మహారాణిపేట: సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ అన్నారు. 28వ వార్డు దసపల్లా హిల్స్‌లో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించి, మాట్లాడారు. ఎటువంటి సర్టిఫికెట్లు కావాలన్నా.. దరఖాస్తు చేస్తే తక్షణం ఇవ్వగలమని చెప్పారు. 19 కుల, 2 ఆదాయ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు వచ్చాయి. స్థానికులు మొత్తం 21 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఎండోమెంట్ ఈవో ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకుడు కనకరాజు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నృత్య సమ్మేళనం అద్భుతం



భామాకలాపంపై ప్రసంగిస్తున్న డాక్టర్ రమాదేవి



నృత్యంతో అలరిస్తున్న నృత్యకారులు

'ఐటీడీసీ–2024' రెండో రోజు పోటీల్లో 33 నాట్య ప్రదర్శనలు

డాబాగార్డెన్స్: ఐటీడీసీ–2024 పేరిట డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు, డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకుడు బత్తిన రంగ విక్రమ్‌కుమార్ గౌడ్ సారథ్యంలో అంతర్జాతీయ సంప్రదాయ నృత్య సమ్మేళనం అద్భుతంగా జరుగుతోంది. రెండో రోజు శనివారం ఉదయం నుంచి ఔత్సాహికులకు నిర్వహించిన నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. దేశం నలుమూలల నుంచి హాజరైన జాతీయ, అంతర్జాతీయ నృత్యోత్సవ నిర్వహణ నిపుణులు సాయివెంకటేష్, జగబంధు జెనా, కాశ్మీరా త్రివేది, డాక్టర్ కళాకృష్ణ, డాక్టర్ కేశవరాజు బాలకృష్ణన్, డాక్టర్ పి.రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పోటీలకు డాక్టర్ సజని వల్లభనేని, కేశవరాజు బాలకృష్ణన్ న్యాయ నిర్ణేతలుగా, యువ కూచిపూడి నర్తకీమణులు బత్తిన సిస్టర్స్ తేజశ్రీ, భాగ్యశ్రీ నిర్వాహకులుగా వ్యవహరించారు. కూచిపూడి, భరతనాట్య రీతుల్లో సీనియర్, జూనియర్, సోలో విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 33 బృందాలు తమ నైపుణ్యాలతో ప్రేక్షకులను మైమరిపించాయి.

తొలి సెషన్లో తెలంగాణకు చెందిన బి.సుధీర్ రావు చైర్మన్‌గా వ్యవహరించారు. భామాకలాపం కూచిపూడి నృత్యనాటకం విమర్శనాత్మక విశ్లేషణ అనే అంశంపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళారత్న కె.వి.సత్యనారాయణ మాట్లాడారు. తెలంగాణకు చెందిన వసంత పెండ్యాల పేపర్ ప్రజంటేషన్ జరిగింది. ఏపీకి చెందిన అరుణా పరమేష్ కాకర భారతీయుల ప్రాథమిక విద్యలో శాస్త్రీయ నృత్యాల ఆవశ్యకత అనే అంశంపై పత్రాలు సమర్పించగా, గొల్ల కలాపం–విజ్ఞాన, తత్వశాస్త్రాలకు ప్రతిక అనే అంశంపై తెలంగాణకు చెందిన కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రమాదేవి సోదాహరణ ప్రసంగం రసవత్తరంగా సాగింది. గొల్లకలాపంలో విప్పుడిగా, గొల్లభామగా డాక్టర్ రమాదేవి చేసిన ద్విపాత్రాభినయం, పిండోత్పత్తి శాస్త్ర వివరణలు ఆహా అనిపించాయి. రాష్ట్రానికి చెందిన యలమంచలి హనుమంతరావు డాక్టర్ వెంపటి చినసత్యం శుశ్రూషలో తాను దేశవిదేశాల్లో సంపాదించిన అనుభవాల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శన, పరిణామాలపై పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికా కండలికి నాట్య భూషణ్, ఒకరికి యంగ్ ఎచీవర్, 16 మందికి ఐటీడీసీ అవార్డులు ప్రదానం చేశారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



రథయాత్రలో అదరగొట్టిన తప్పెటగుళ్ల కళాకారులు



రథం లాగుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆలయ అధికారులు



కోలాటమాడుతున్న మహిళలు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు బురుజుపేట కనకమహాలక్ష్మి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి విశేషంగా పూజలు చేశారు. శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు అమ్మవారికి క్షీరాభిషేకం, పసుపు కుంకుమ నీళ్లతో అభిషేకం జరిపారు. సహస్రతులసీ దళార్చన చేశారు. పూజా కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. సిరులతల్లిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 3 వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేటి కార్యక్రమాలు..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు కనకమహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహిస్తారు.

రథయాత్రలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నేత్రపర్వంగా నిర్వహించిన కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్రను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, దేవస్థాన ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు ప్రారంభించారు. అమ్మవారి మాలధారులు అధిక సంఖ్యలో పూర్ణ కలశాలతో పాల్గొన్నారు. రథయాత్రలో విజయనగరం మహారాజా కళాశాల కళాకారులు ప్రదర్శించిన పులివేషాలు, తప్పెటగుళ్లు, చెక్కభజన, కోలాటం, నవదుర్గలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సిబ్బంది సంక్షేమానికే ప్రాధాన్యం



పదోన్నతి పొందిన ఉద్యోగిని సత్కరిస్తున్న సీపీ

అల్లిపురం: పోలీస్ సిబ్బంది సంక్షేమానికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ కమిషనరేట్‌లో గల టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పదోన్నతులు పొందిన సిబ్బందికి ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. పదోన్నతులు పొందిన సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో సహా సత్కరించారు. పదోన్నతి పొందిన ఏడుగురులో ఎస్.ఐలు, ఏఎస్ఐలు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, మహిళా హెడ్ కానిస్టేబుళ్లు, ఒక ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

కిటకిటలాడిన 'బల్లిగిరి'



అల్లిపురం : ధనుర్మాసం రెండో శనివారం సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామున 5 గంటల నుంచి స్వామికి అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ఆరాధన, భక్తుల గోత్రనామాలతో ధనుర్మాస అర్చనలు, తిరుప్పావై సేవాకాలం, నివేదన, మంగళాశాసనం, నీరాజనం, మంత్రపుష్పం, గోదాదేవి తిరుప్పావై పాసుర విన్నపం అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ముందుగా దేవాలయం కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కె.పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పైప్‌లైన్ ఏర్పాటు



పనులు పర్యవేక్షిస్తున్న పచ్చిరిపల్లి లక్ష్మి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న 33వ వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మి జోన్ – 4 జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేయడంతో స్పందించారు. వార్డు లోని మిరపకాయల వీధిలో డ్రైనేజీలో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ పనిని మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మి పర్యవేక్షించారు. అదేవిధంగా కుమ్మరవీధిలో మంచినీటి పైప్‌లైను కూడా త్వరగా మార్చాలని ఆమె కోరారు. ఈ మేరకు స్థానికులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సేవా తత్పరుడు ద్రోణంరాజు సత్యనారాయణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీవత్సవ్, తదితరులు

డాబాగార్డెన్స్: మాజీ ఎంపీ ద్రోణంరాజు సత్యనారాయణ వర్ధంతి శనివారం పాతనగరం లక్ష్మీ టాకీస్ జంక్షన్ వద్ద స్వామి వివేకానంద సంస్థ నేతృత్వంలో నిర్వహించారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి ద్రోణంరాజు శ్రీవత్సవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలకు మహాన్నదానం నిర్వహించారు. అనంతరం శ్రీవత్సవ్ మాట్లాడుతూ తాతయ్య గొప్ప రాజకీయవేత్తని, నిర్భయంగా అభిప్రాయాలు తెలిపి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వివేకానంద సంస్థ అంటే ఆయనకు చాలా అభిమానమని తెలిపారు. తండ్రి ద్రోణంరాజు శ్రీనివాసరావు, తాత సత్యనారాయణ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని, వివేకానంద సంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో పాల్గొని అండగా ఉంటానని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, దొండ రాంబాబు, కొప్పుల వెంకట్రావు, దుర్గారావు, సంస్థ సభ్యులు డి.సత్తిబాబు, పి.అప్పలకొండ, సీహెచ్ పైడిరాజు, వివేకానంద సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, సుజాత, రత్న, రాణి, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

అల్లిపురం: దివంగత ద్రోణంరాజు సత్యనారాయణకు పలువురు శనివారం ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ 33వ వార్డు నాయకుడు భీశెట్టి ప్రసాద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, తదితరులు సిరిపురం జంక్షన్‌లో గల ద్రోణంరాజు సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అపూర్వ కలయిక



తరగతి గది ముందు ఫొటో తీసుకుంటున్న ఏవీఎన్ కాలేజీ పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో విద్యనభ్యసించిన 1990 బ్యాచ్ విద్యార్థులు శనివారం కలిశారు. కళాశాల ప్రాంగణంలో కలిసి నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కళాశాలలో చదివిన బీఎస్సీ తరగతి గది ముందు ఫొటోలు తీసుకున్నారు. కళాశాలకు చిహ్నంగా రాతి కట్టడంతో నిర్మితమై ఉన్న చార్మినర్ వద్ద ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడుతో కలిసి ఫొటోలు దిగారు. కాసేపు ప్రిన్సిపాల్‌తో మాట్లాడి కళాశాల అభివృద్ధికి సంబంధించి చర్చించారు. తమ సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తెలిపారు. 'ఓల్డ్ స్టూడెంట్స్ ఏవీఎన్ కళాశాలకు రియల్ పిల్లర్స్' పేరిట వీరంతా కలిసి సందడి చేశారు.

ఉపాధి కోర్సులతో కుటుంబానికి ఆసరా

డాబాగార్డెన్స్: ఉపాధి కోర్సులతో కుటుంబానికి ఆసరా అని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ జి.దేముడు బాబు సూచించారు. ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డులో గల బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థ సహకారంతో నిర్వహించిన టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సీఐ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు తీరిక సమయాల్లో స్వయం ఉపాధి కోర్సులపై దృష్టి సారించి, ఆర్థికంగా నిలబడాలని సూచించారు. శిక్షణ అందిస్తున్న బాల వికాస్ ఫౌండేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, స్థానిక నాయకుడు గోడే నరసింహాచారి, కస్తూరి వెంకటరావు, బ్రహ్మకుమారి రామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికడదాం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం, వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్తంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను కుంగదీసే మాదక ద్రవ్యాలను మనం అరికట్టాలన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ ఎం.జ్ఞానేశ్వరి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల సమాజానికి చాలా నష్టం కలుగుతుందన్నారు. మాదక ద్రవ్యాల కట్టడిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎస్.అనురాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ కె.ఎల్.శిరీష, డాక్టర్ ఎల్.లావణ్య, డాక్టర్ బి.హైమావతి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు నవరంగపూర్ నివాసి



కలాస్ గౌడ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న బెనర్జీ

సీతమ్మధార: ఒడిశాలోని నవరంగపూర్‌కు చెందిన కలాస్ గౌడ్ అనే వృద్ధుడు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. ఊరు వదిలి కొన్నాళ్లు ముంబైలోని ఒక బీర్ షాపులో, తరువాత పూణెలో గ్యాస్ డీలర్ దగ్గర పనిచేసి చివరకు విశాఖపట్నం చేరుకున్నాడు. ఏయూటీడీ సిబ్బంది ఇతడిని రెస్క్యూ చేసి నాలుగు నెలల పాటు షెల్టర్‌లో ఉంచి, మందులిచ్చి మామూలు మనిషిగా మార్చారు. వైజాగ్ నుంచి నేరుగా నవరంగ్‌పూర్‌కు తీసుకెళ్లి అన్న కొడుకు రాజేంద్ర మోహన్కుడాకు కలాస్ గౌడ్‌ను క్షేమంగా అప్పగించారు. రీయూనియన్ చేసిన శ్రద్ధా సోషల్ వర్కర్ సువాదీప్ బెనర్జీకి, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.